నామకరణోత్సవంలో కేటీఆర్, హరీశ్‌రావు



శేరి సుభాష్‌రెడ్డి మనవరాలి నామకరణోత్సవంలో పాల్గొన్న కేటీఆర్, హరీశ్‌రావు

మెదక్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి మనుమరాలు విరాధ్య నామకరణోత్సవాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి హాజరై, విరాధ్యను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్ రెడ్డి, యాదవరెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలు

ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహిస్తున్న ఆర్మీ అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 19: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఎంపికలను శనివారం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సరంలో చేరిన 200 మంది విద్యార్థులు పాల్గొనగా, వంద మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు మూడేండ్లపాటు శిక్షణనిస్తారని, దీంతో ఆర్మీ, పోలీసు కానిస్టేబుల్, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ ఉద్యోగాలకు అర్హతను పొందవచ్చన్నారు. సంగారెడ్డి ఆర్మీ అధికారులు మహేశ్ బచత్, గురుప్రీత్‌సింగ్, కళాశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జి సురేందర్‌రావు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.లక్ష విరాళం

చేగుంట, అక్టోబర్ 19: వడియారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న వసంత విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పిస్తే బాగుంటుందనే సంకల్పంతో రూ.లక్ష విరాళం అందించారు. బడిలో మరుగు దొడ్లు, బాతురూంలు సరిగా లేక ఇబ్బందికరంగా ఉండడంతో విరాళం అందించేందుకు ముందుకొచ్చారు. శనివారం హెచ్ఎం సిద్దిరాములకు చెక్కును అందజేశారు. ఆమెతో పాటు ప్రియదర్శిని, సంతోషిమాత, అమరేశ్వరి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, బండారి నాగరాజు ఉన్నారు.

మైదానం అనుకుంటే కుంటలో కాలేసినట్లే!

ఈ ఫోటోలో కనిపిస్తున్నది పచ్చిక మైదానం అని అనుకుంటే కుంటలో కాలేసినట్టే.. ఇది నర్సాపూర్ మున్సిపాలిటీలోని తూప్రాన్ మార్గంలో గల కోమటికుంట. విశాలమైన కోమటి కుంటలో నీళ్లు కనిపించనంతగా పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క పెరిగాయి. మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. మున్సిపల్ సిబ్బంది వెంటనే కుంటలోని గుర్రపు డెక్కను తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు. **- నర్సాపూర్,అక్టోబర్19**

దుర్గామాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి

దుర్గామాతకు పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

పాపన్నపేట, అక్టోబర్ 19: ఏడుపాయల వనదుర్గా భవానీ అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయసేన్ రెడ్డి శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వీరికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అంతకు ముందు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ వారిని సన్మానించారు. వారి వెంట జిల్లా జడ్జి లక్ష్మీ శారద, జడ్జి రీటాలాల్, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి, ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కాలనీవాసులు ఆందోళన చెందవద్దు

రామాయంపేట ఫారెస్టు డిప్యూటీ రేంజర్ శ్రీనివాస్‌నాయక్

కాలనీ హైవే బ్రిడ్జి వద్ద కొండచిలువ

రామాయంపేట, అక్టోబర్ 19: కేసీఆర్ కాలనీవాసులు ఎలాంటి ఆందోళనలకు గురికావద్దని, ఇక్కడ తిరుగుతున్న కొండ చిలువను త్వరలోనే గుర్తిస్తామని రామాయంపేట అటవీశాఖ డిప్యూటీ అధికారి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక కేసీఆర్ కాలనీ పరిసర ప్రాంతాలను అటవీశాఖ సిబ్బంది సందర్శించారు. అనంతరం డిప్యూటీ రేంజర్ మాట్లాడారు. కొండ చిలువ విషసర్పం కాదని, దాంతో ఎలాంటి అపాయం లేదన్నారు. ఆయన వెంట బీట్ అధికారి లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి సహకరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

పాపన్నపేట,అక్టోబర్ 19: విద్యార్థుల చదువుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు సహకరించాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. శనివారం మండలంలోని పొడిచాన్‌పల్లి ఉన్నత పాఠశాలలో తల్లిందండ్రుల సమావేశానికి హాజరయ్యారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పు కనిపిస్తే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కిషన్, భద్రయ్య, భవానీ ప్రసాద్, శివశంకర్, చంద్రకాంత్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ ప్రాంతాన్ని మర్చిపోలేను

సీనియర్ సివిల్ జడ్జి అనితను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులు

నర్సాపూర్, అక్టోబర్ 19: నర్సాపూర్ ప్రాంతాన్ని మర్చిపోలేనని, న్యాయపరమైన సేవలను అందించడంలో ప్రత్యేక సంతృప్తిని పొందానని సీనియర్ సివిల్ జడ్జి అనిత అన్నారు. నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహించి దేవరకొండా సివిల్ కోర్టుకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా నర్సాపూర్ కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, న్యాయవాదులు అంజిరెడ్డి, జాఫర్ ఆలీ, ఖాజా మొయినోద్దీన్, శ్రీనివాస్‌గౌడ్, మధుశ్రీశర్మ, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రధానోపాధ్యాయుడు మాకొద్దు

టీచర్లతో మాట్లాడుతున్న తల్లిదండ్రులు

చిన్నశంకరంపేట, అక్టోబర్ 19: మండలంలోని గజగట్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గాలయ్య పాఠశాలకు సమయానికి రాకుండా ఇష్టానుసారంగా వస్తున్నాడని, విద్యార్థులను నానా బూతులు తిడుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఓ విద్యార్థినిని కొట్టడంతో మందలించి వదిలేశారు. అతడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, హెచ్ఎంను శనివారం నిలదీశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవో పుష్పవేణిలకు ఫోన్ చేసి పాఠశాలలో జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. గాలయ్యపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని ఎంఈవో తెలిపారు.

మాలల మహా పాదయాత్రను విజయవంతం చేయాలి

నిజాంపేట, అక్టోబర్ 19: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం తలపెట్టిన మహా పాదయాత్రను విజయవంతం చేయాలని మాల మాహానాడు రాష్ట్ర పోలిట్ బ్యూరో చైర్మన్ శ్రీరాములు కోరారు. శనివారం నిజాంపేటలో కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెంటయ్య, సంయుక్త కార్యదర్శి శివ, జిల్లా అధ్యక్షుడు సంజీవ, ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్, కార్యదర్శి సంజీవ్, రామాయంపేట, నిజాంపేట మండల అధ్యక్షుడు సిద్ధిరాములు, చంద్రయ్య పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి

శ్రీనివాస్ (ఫైల్)

చేగుంట, అక్టోబర్ 19: చెరువులో నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన నార్సింగి మండలం నర్సంపల్లిలో శనివారం జరిగింది. నార్సింగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉడుత శ్రీనివాస్(50) చెరువులో చేపలు పట్టేందుకు శుక్రవారం రాత్రి వేసిన వలలను తీసేందుకు చెరువులో దిగాడు. ఇంతలోనే శ్రీనివాస్‌కు ఫిట్స్ రావడంతో వల అతడికి చూట్టుకుని నీట మునిగి మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అహ్మద్ మోయినోద్దీన్ తెలిపారు.

మహిళ అదృశ్యం

లలిత (ఫైల్)

నర్సాపూర్, అక్టోబర్ 19: మహిళ అదృశ్యమైన ఘటన నర్సాపూర్‌లోని దోభీగల్లిలో జరిగింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. చాకలి లలిత (50) ఈ నెల 16వ తేదీ నుంచి కనబడడంలేదు. ఆమె కొడుకు, కోడలు బయట పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చే సరికి లలిత కనబడకుండా పోయింది. చుట్టుపక్కల, తెలిసిన ప్రదేశాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

పెద్దశంకరంపేటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నర్సాపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నిజాంపేటలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- **రైతులను దగా చేస్తున్న కాంగ్రెస్ సర్కార్**
- **నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

పెద్దశంకరంపేట, అక్టోబర్ 17: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసా ఇవ్వనందుకు నిరసనగా పెద్దశంకరంపేటలో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అందజేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హమీలు అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, జంగం రాఘవులు, సురేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, శంకర్‌గౌడ్, అంజ్యయ ఉన్నారు.

నర్సాపూర్‌లో..

నర్సాపూర్, అక్టోబర్ 19: రైతుభరోసాను ఎగ్గొట్టి, రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాటలకు నిరసనగా శనివారం నర్సాపూర్‌లోని బస్టాండ్ సమీపంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించి, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వెంకటనర్సింగరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ శివకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ సర్పంచ్‌లు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో మాట్లాడుతున్న నర్సారెడ్డి

రామాయంపేటలో..

రామాయంపేట, అక్టోబర్ 19: రైతులకు సకాలంలో రైతు భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కార్ దగా చేస్తున్నదని రైతు బంధు మండల మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. రామాయంపేట బాలాజీ గార్డెన్‌లో విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతులకు ఎకరాకు రూ.15వేలు ఇస్తానని మోసం చేశారన్నారు. రైతు బంధు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న రేవంత్‌కు రైతుల ఊసురు తగులుతుందన్నారు.

నిజాంపేటలో..

నిజాంపేట, అక్టోబర్ 19: రైతులకు ఈ సీజన్‌లో రైతుభరోసా నిధులు జమ చేయమని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంపై నిజాంపేట మండల బీఆర్ఎస్ నాయకులు, రైతులు మండిపడ్డారు. శనివారం నిజాంపేట బస్టాప్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి డౌన్.. డౌన్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, డైరెక్టర్లు అబ్దుల్ అజీజ్, స్వామిగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ రవి, నాయకులు రాములు, లక్ష్మణ్, నరేందర్, మహేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ ఓసీ అందజేత

చిలిపిచెడ్: బాధితుడికి ఎల్‌వోసీ చెక్కును అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి

నిజాంపేట: బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ ఎంపీపీ సిద్ధిరాములు

చిలిపిచెడ్, అక్టోబర్ 19: ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలం అంతారం భీమ్లా తండాకు చెందిన మాలి అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందుతున్నది. వైద్యం ఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2లక్షల ఎల్‌వోసీ చెక్కును ఆమె కుమారుడు సామ్యా నాయక్‌కు ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని కార్యాలయలో శనివారం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు గుంజరి ప్రవీణ్ కుమార్, శేకులు, వెంకట్‌గౌడ్, శేఖర్ గుప్తా పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

నిజాంపేట, అక్టోబర్ 19: నస్కల్‌కు చెందిన అక్బర్‌కు రూ.8,500, కర్రయ్యకు రూ.11.500 సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. మాజీ ఎంపీపీ సిద్ధిరాములు బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మాగౌడ్, లింగంగౌడ్, జలేందర్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో విజ్ఞాన చైతన్య సదస్సు

నిజాంపేట, అక్టోబర్ 19: నిజాంపేట శంకర పాఠశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విజ్ఞాన చైతన్య సదస్సును శనివారం నిర్వహించారు. సైంటిఫిక్ స్టూడెంట్ ఆఫ్ ఫెడరేషన్ కమిటీ సభ్యుడు నరేశ్ మంత్రాలు, చేతబడి వంటివి లేవని, శాస్త్రీయంగా జీవించాలని తన ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్సై జైపాల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

కొల్చారం, అక్టోబర్ 19: దళితులపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని దళిత సంఘాల నాయకులు శనివారం డిమాండ్ చేశారు. మండలంలోని తుక్కాపూర్‌లో మాట్లాడుతూ దళిత యువకుడు రమేశ్ ఇంటికి వస్తుండగా గ్రామానికి చెందిన కొందరు భౌతిక దాడికి పాల్పడ్డారనానరు. ఈ విషయంలో ఈ నెల 11న నిందితులపై ఎస్‌సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు.

వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలి

కలెక్టర్ రాహుల్‌రాజ్

రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

అల్లాదుర్గం, అక్టోబర్ 19: దవాఖానలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అంకితభావంతో పని చేయలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం అల్లాదుర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రక్త పరీక్షల గది, మందుల గది, ఇన్ పేషెంట్ వార్డు, టాయిలెట్స్, పలు రికార్డులను పరిశీలించారు. ప్రతి రోజు పీహెచ్‌సీకి ఎంతమంది రోగులు వస్తున్నారు. ఈ నెలలో ఇప్పటివరకు ఎన్ని డెలివరీలు చేశారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దవాఖానకు వచ్చే రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారులు, సిబ్బంది పనితీరుపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి అశ్విని, సిబ్బంది ఉన్నారు.

బాలబాలికల ఫుట్‌బాల్‌లో టాలెంట్ హంట్ పోటీలు

ఫుట్‌బాల్ టాలెంట్ హంట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 19: ఇండియా ఖేలో ఫుట్‌బాల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో అండర్ -17 బాలబాలికలకు శనివారం టాలెంట్ హంట్ పోటీలను నిర్వహించారు. ఈ క్రీడలను జిల్లా క్రీడల, యువజన అధికారి దామోదర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాలెంట్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించడంతో పాటు శాస్త్రీయ పద్ధతిలో శిక్షణనివ్వనున్నట్లు తెలిపారు. అండర్ -17 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో మెదక్ జట్టు రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. టాలెంట్ హంట్ పోటీల్లో సౌత్ ప్లాన్ ఫుట్‌బాల్ క్లబ్ అధ్యక్షుడు విష్ణుతేజ, మెదక్ ఫుట్‌బాల్ అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు వంశీ, వినయ్, సభ్యులు ప్రశాంత్, మున్నా, శిక్షకులు ప్రకాశ్, భాగ్యమ్మ, ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

రైతు యాదయ్య మృతదేహం

వెల్దుర్తి, అక్టోబర్ 19: అడవి పందుల నుంచి పంటను కాపాడడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి రైతు మృతి చెందిన ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని యశ్వంతరావుపేటలో శనివారం జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండెని యాదయ్య(46) తన పొలం వద్ద పంట రక్షణకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేశాడు. రోజు వారిలాగే శుక్రవారం రాత్రి పంట కాపలాకు వెళ్లిన యాదయ్య కాలుకు విద్యుత్ కంచె తగలడంతో విద్యుత్ షాక్ అక్కడికక్కడే మృతిచెందాడు. శనివారం గమనించిన చుట్టుపక్కల రైతులు యాదయ్య కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు శవపంచనామా చేసి, పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. యాదయ్య భార్య ఇందిర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలి

ఉమాసంగమేశ్వర ఆలయంలో మాధవానంద సరస్వతీ స్వామి, ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెద్దశంకరంపేట, అక్టోబర్ 19: ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని అధ్యాత్మిక చింతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. శనివారం కొప్పోల్ ఆలయంలో స్వామి ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి వేద బ్రాహ్మణ పండితు మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు చేశారు.

దళిత దంపతులపై కాంగ్రెస్ నాయకుడి దాడి

బాధిత దంపతులు

శివ్వంపేట, అక్టోబర్ 19: దళిత దంపతులపై కాంగ్రెస్ నాయకుడు దాడి చేసిన ఘటన శివ్వంపేట మండలం దొంతి గ్రామంలో చోటుచేసుకున్నది. బాధితులు కొదాస్ స్వామి, పూలమ్మ మాట్లాడుతూ ఈ నెల 16న రాత్రి ఇంటిముందున్న నీరుడి భిక్షపతికి చెందిన గేదె వచ్చి తమ గేదెతో తలపడడంతో కన్నుపోయిందన్నారు. కాంగ్రెస్ నాయకుడు మల్లవరం వెంకట్‌రెడ్డి పెద్దల సమక్షంలో దవాఖాన ఖర్చులు ఇప్పిస్తానన్నాడన్నారు. తమకు భిక్షపతి నష్టపరిహారం ఇవ్వడం లేదని వెంకట్‌రెడ్డిని అడిగితే ఇష్టానుసారంగా కులం పేరుతో బూతులు తిడుతూ తమపై దాడి చేశాడని బాధితులు తెలిపారు. శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌కు వెళితే ఎస్సై కూడా తిట్టి బయటకు పంపించాడన్నారు. కులం పేరుతో దూషించిన వెంకట్‌రెడ్డిపై, శివ్వంపేట ఎస్సైపై చర్యలు తీసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దొంతి మాజీ ఎంపీటీసీ కోదాస్ లక్ష్మీకుమార్, ఉన్నారు.

దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్

బర్రె పంచాయతీ విషయంలో దొంతి గ్రామానికి చెందిన కోదాస్ స్వామి, పూలమ్మ దంపతులపై దాడి చేసిన వారిపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాదిగ డిమాండ్ చేశారు.

దూషించారని కేసు నమోదు

శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన మల్లవరం వెంకట్‌రెడ్డి, అదే గ్రామానికి చెందిన కొదాసు స్వామి, పూలమ్మను దూషించి చేతులతో నెట్టాడు. బాధితుడు మల్లవరం వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొదాసు స్వామి, పూలమ్మపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

నేడు ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 19: రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుకు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయనున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి రావాలని పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు శనివారం ప్రకటనలో పిలుపునిచ్చారు. కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి తదితర నాయకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఫ్లాగ్ డేను విజయవంతం చేయాలి

మెదక్ అర్బన్, అక్టోబర్ 19: జిల్లాలో ఈనెల 21న నిర్వహించనున్న పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాల స్మరణ సభను విజయవంతం చేయాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందులో భాగంగా పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా సంస్మరణ కార్యక్రమాలను ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

చిలిపిచెడ్, అక్టోబర్ 19: పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం చిలిపిచెడ్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్, వోఎస్‌లు శంకర్, అరవింద్, పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ, అక్టోబర్ 19: జిల్లా కేంద్రం మెదక్‌లోని ముత్యాలమ్మ ఆలయం, చమాన్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ మోహన్‌బాబు, ఏఈ నవీన్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. స్తంభాల మార్పు, వైర్లు ఇతర మరమ్మత్తులు పనుల దృష్ట్యా సరఫరాలో అంతరాయాన్ని గమనించి సహకరించ